


18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
మంగళవారం | 17 డిసెంబర్ 2024 | పేజీలు 8

## మా మొర ఆలకించండి రైల్వే మంత్రిగారూ !



### తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ సమస్యలపై పార్లమెంటు జీరో హావర్‌లో గళమెత్తిన ఎంపీ గురుమూర్తి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్ :** తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని వివిధ రైల్వే సమస్యలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం పార్లమెంటు జీరో హావర్‌లో గళమెత్తారు. ఈ సందర్భంగా పలు రైల్వే సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న రైల్వే ట్రాఫిక్ దృష్ట్యా రేణిగుంట -గూడూరు మధ్య -మిగతా 2లో







## వైష్ణవి డైరీ మూత..

# రోడ్డున పడ్డ జీవితాలు..

- ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను సస్పెన్షన్ చేసిన అధికారులు
- సమాచారం లేకుండానే డైరీని మూసేసిన యాజమాన్యం
- మేము ఎలా బతకాలి అంటూ బోరున విలపిస్తున్న ఉద్యోగులు
- స్పందించని డైరీ యాజమాన్యం.. అయోమయంలో ఉద్యోగులు
- డైరీ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఉద్యోగులు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్ :** పునబాక గ్రామంలో ఉన్న వైష్ణవి డైరీ మూసివేయడంతో ఉద్యోగుల జీవితాలు రోడ్డు మీద పడ్డాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని పునబాక గ్రామంలో గత 12 యేళ్లు నుండి వైష్ణవి డైరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. దాదాపు వందల మంది ఉద్యోగులు ఈ డైరీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలా ఉన్న తరుణంలో డైరీ యాజమాన్యం ఉద్యోగులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా డైరీని మూసివేయడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వైష్ణవి డైరీకి ఉన్న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ అఫ్ ఇండియా లైసెన్స్‌ను సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు సస్పెన్షన్‌లో పెట్టారు. వైష్ణవి డైరీ నుండి సరైన పత్రాలు డైరీ యాజమాన్యం సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఇవ్వకపోవడంతో లైసెన్సును సస్పెన్షన్ లో పెట్టినట్టు సమాచారం. వైష్ణవి డైరీ మూసివేయడంతో ఉద్యోగులు డైరీ ముందు సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఉద్యోగుల మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలనుండి డైరీ కంపెనీలో పని చేస్తుంటే డైరీ యాజమాన్యం ఎటువంటి సమాచారం లేకుండా డైరీ మూసివేయడంపై వారు బోరున విలపిస్తున్నారు. గత 10 సంవత్సరాల నుండి ఉద్యోగులకు ఎలాంటి బోనస్‌లు కాని ఇంక్రిమెంట్‌లు కాని, ఎక్స్పీరియన్స్ -మిగతా 2లో




## మనసు గెలిచిన సంజీవయ్య



- ఎన్నికల్లో ఓడినా.. ప్రజాక్షేత్రంలో
- నాడు అభివృద్ధిలో.. నేడు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుకు..
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ఎండగడుతూ అడుగులు
- మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులే శిరోధార్యం అంటున్న
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట టౌన్, మేజర్‌న్యూస్ :** సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజల కోసం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని మాజీ సీఎం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభిమానాన్ని చూరగొని. సూళ్లూరుపేట రెండు దఫాలుగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య విజయవంతంగా పరిపాలన సాగించారు. ప్రజాభిమానంతో రెండో సారి సైతం సూళ్లూరుపేట నియోజకవర్గం విజయకేతనం ఎగరేసి అత్యధిక నిధులు రాబట్టి కరువు కేంద్రంగా ఉన్న సులూరుపేట నియోజకవర్గంలో అభివృద్ధికి పూలబాటలు ఎగరేశారు. ఎన్నికల్లో ప్రభుత్వం మార్పుతో తన బాధ్యత పెరిగిందని గుర్తించి.. ప్రజలకు మరింత చేరువవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన పోరాటంలో ఓటమి చెందిన భయపడకుండా తనను అభిమానించే ప్రజల కోసం రాజకీయంగా తనను ఆశీర్వ దించిన నియోజకవర్గ ప్రజలకోసం, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పరిత పిస్తూ ముందుకు సాగుతున్నారు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య. దశాబ్దాలుగా బీడు బారిన సూళ్లూరుపేట నియోజకవర్గంలో స్వర్ణముఖి, తెలుగు గంగ నీళ్లు పారించి లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చిన ఘనత సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకే -మిగతా 2లో

## చిత్తూరులో రోడ్డు విస్తరణ జరగాల్సిందే




02లో

## వైష్ణవి డైరీ మూత... రోడ్డున పడ్డ జీవితాలు

*(మొదటి పేజీ తరువాయి)*

లెటర్‌లు కాని, ఇవ్వకుండ డైరీ మూసివేయడంపై వారు మండిపడ్డారు. డైరీ యాజమాన్యం ఉద్యోగులకు స్పందించడం లేదని యాజమాన్యం చరవాణిలు ఆఫ్‌లో ఉన్నాయన్నారు. డైరీ యాజమాన్యం తీరు పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు.ఇప్పటికైన డైరీ యాజమాన్యం స్పందించి మా ఉద్యోగులకు తగు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## మా మొర ఆలకించండి రైల్వే మంత్రిగారూ !

*(మొదటి పేజీ తరువాయి)*

మూడవ రైల్వే లైన్ నిర్మాణం కూడా అత్యవసరమని ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే మార్గాలపై భారం తగ్గించి, ప్రయాణం వేగవంతం చేసేందుకు ఈ కొత్త లైన్ ఎంతో అవసరమనే విషయాన్ని వివరించారు. అలాగే పూడి, ఏర్పేడు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడం ద్వారా స్థానిక ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగవుతుందని తెలిపారు. ఇది స్థానిక ఆర్థిక వనరుల్ని బలోపేతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఈ లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తెసుకోవాలని కోరారు. కోవిడ్-19 సమయంలో కొన్ని రైళ్లు స్టాపింగ్‌లను ఎత్తేశారని తిరిగి వాటిని పునరుద్ధరించాలని, అందులో భాగంగా వెందోడు, నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో నిలిపివేసిన రైళ్ల స్టాపింగ్‌లను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. తద్వారా ఈ ప్రయాణికులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని మంత్రికి ఎంపీ వివరించారు. తిరుపతి-నెల్లూరు మరియు కడప మధ్య మెము సర్వీసులు అందించడం ద్వారా నిత్యం ప్రయాణించే వారికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గూడూరు అంబేద్కర్ నగర్ వద్ద ఇరుకైన అండర్ పాస్ కారణంగా తీవ్ర రవాణా సమస్యలు ఎదురవుతున్నాయని . దీనిని విస్తరించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలను తగ్గించవచ్చని వివరించారు. తిరుపతి, విశాఖపట్నం మధ్య వందే భారత్ స్లీపర్ రైలు సేవలను అందించడం ద్వారా యాత్రికులకు వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయని ఎంపీ వివరించారు. అలాగే, తిరుపతి నుంచి వారణాసి -అయోధ్యకు కొత్త రైలు సర్వీసులు ప్రారంభించడం ద్వారా భక్తులు, యాత్రికులకు అద్భుతమైన రవాణా సౌకర్యాలను కల్పించొచ్చని గౌరవ సభ ద్వారా కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి ఎంపీ గురుమూర్తి తీసుకెళ్లారు. కావున, ఈ ప్రాజెక్టులపై తక్షణం దృష్టి సారించి వాటి అమలును వేగవంతం చేయాల్సిందిగా రైల్వేమంత్రికి తిరుపతి ఎంపీ విజ్ఞప్తి చేశారు.

## స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం

**పాకాల, మేజర్ న్యూస్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు స్థానికీ కరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈరోజు, రేపు ,రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులతో పాటు సర్పంచ్లు కూడా పాల్గొంటారని తెలియజేశారు.

## మామిడి ఫ్రూట్కవర్లకు ఆన్లైన్ నమోదు చేసుకోండి

**పెనుమూరు, మేజర్ న్యూస్:** ఉద్యానవన శాఖ ద్వారా మామిడి పంట సాగు చేశా రైతులకు మామిడి లో టేబుల్ రకాల కోసం మామిడి కాయలకు కట్టడానికి ఫ్రూట్ కవర్లు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో వారికి సంబంధించిన పాస్ బుక్ ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్లు నకలు ఇచ్చి సీజనుకు ముందుగా ఆన్లైన్ నమోదు చేసుకోవాలని సోమవారం ఉద్యానవన శాఖ అధికారి సాగారిక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా మామిడి పంట సాగు రైతులు తమ పంటలకు కావలసినంత కాయలకు కట్టడానికి ఫ్రూట్ కవర్లు సంఖ్యను నమోదు చేసి తమ రికార్డులను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫ్రూట్ కవర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధర విక్రయించడం జరుగుతుందని తెలిపారు. కావున మామిడి పంట సాగు రైతులు ఆన్లైన్ నమోదు చేసుకున్న వారికి జనవరి నెలలో ఫ్రూట్ కవర్లు ఇవ్వడం జరుగుతుంది.

## రోటరీ క్లబ్ సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ



**సూళ్లూరుపేట, మేజర్ న్యూస్:** పట్టణ ప్రాంతంలో అంత ర్జాతీయ దినోత్సవం వారోత్సవాల్లో బాగంగా దివ్యాంగ సేవ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాదెండ్ల శాంత కుమారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో సోమ వారం దివ్యాంగుల పండుగను స్థానిక మున్సిపల్ కమిష నర్ చిన్నయ్య చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు దివ్యాంగులను ప్రభుత్వం చట్టప్రకారం వారి కోరికలను వారి బ్రతుకుల్లో వెలుగులు నింపాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పేదలకు ఉచితంగా అన్న దానం చేసిన కాళంగి ప్రభాకర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. శేషగిరావు, రామక్రిష్ణ, సూర్యకుమారి, కనకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రేపు పొలం పిలుస్తుంది కార్యక్రమం...

**పాకాల, మేజర్‌న్యూస్:** మండలంలోని కే వడ్డేపల్లి ఆర్ ఎస్ కె కార్యాలయం నందు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో వ్యవసాయ పథకాల గురించి చర్చించడం జరుగుతుందని, వ్యవసాయ సంబంధిత సందేహాలు ఉంటే రైతులు వచ్చి సలహాలు అడిగి తెలుసుకోవచ్చునని వ్యవసాయ సహాయకుడు ఒక ప్రకటనలో తెలిపారు.

## మనసు గెలిచిన సంజీవయ్య

*(మొదటి పేజీ తరువాయి)*

దక్కింది. ఆయన హయాంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలు చేసి ప్రజల జీవన శైలిలో మార్పు తీసుకువచ్చారు ఆయన.

**-ఎన్నికల్లో ఓడినా.. ప్రజాక్షేత్రంలో**

ఎన్నికల్లో ఓడిన నమ్ముకున్న నాయకుల కోసం,ప్రజల కోసం, కార్యకర్తల కోసం , ప్రజా క్షేత్రంలోకి వచ్చి వారి బాగోగులను అడిగి తెలుసుకుంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ భరోసా కల్పిస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు న్యాయం చేసే దిశగా పోరాటం చేస్తూ కార్యకర్తలకు నాయకులకు కొండంతండగా నిలుస్తున్నారు.

**- వైద్య,విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం..**

ప్రభుత్వ పరంగా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంతో పాటు ఉన్నత విద్యనభ్య సించేందుకు పేదరికంతో ఇబ్బంది పడుతున్న విద్యా కుసుమాలు ఎందరికో కిలివేటి సంజీవయ్య చేయూత నిచ్చారు. గ్రామస్తులు, కార్యకర్తలలో ఎవరైనా పేద విద్యార్థుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగానే ఆర్థిక సాయం అందించి ఉన్నత విద్యనభ్యసించేందుకు ప్రోత్సహించారు. అధికారంలో లేకున్నా అదే కొనసాగింపుగా ఇంకా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తూ ఉన్నారు.

**- సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధికి ప్రోత్సాహకం..**

వెనుకబాటుకు గురైన సూళ్లూరుపేట నియోజకవర్గంలో పగలు ప్రతీకారాలు పెంచుకొని పోలీస్ స్టేషన్ల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగిన గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య గెలిచిన తర్వాత అభివృద్ధి సంక్షేమంతో పాటు- గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేలా అభివృద్ధికి బాటలు వేశారు. కోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి స్కూళ్లను బాగు చేసి గ్రామాలలో సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ కాలువలు, చెరువులను అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే సులూరుపేట నియోజకవర్గం నంబర్ వన్ స్థానంలో నిలబెట్టారు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.

-ప్రజల పక్షాన నిలిచే నాయకుడిగా గుర్తింపు పొందిన సంజీవయ్య రాజకీయ చరిత్రలో చాలామంది నాయకులను గురించి తెలుసుకుని వుంటాం, కొందరిని చూసి వుంటాం. మరి కొందరి గురించి చదివి వుంటాం. ఇంకొందరి గురించి విని ఉంటాం. నాయకత్వ పటిమ కేవలం పార్టీ వర్గీయులు, అనుచరుల బాగోగులు మాత్రమే చూసుకునే వారు కాదు. నాయకుడు అంటే తన చుట్టూ వున్నవారిని సమానంగా చూడగలగాలి.అందరికీ చేయగలిగేవాడే నాయకుడు. కేవలం రాజకీయ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలు, వూహించని ప్రకృతి బీభత్స సమయాల్లోనూ ఎంతో సమయ స్ఫూర్తితో వ్యవహరించి అధిక స్థాయిలో నష్టాలు జరగకుండా ప్రజల్ని ప్రభుత్వ ఆస్తులనూ కాపాడగలిగే చతురత, తెలివి తేటలు, ధైర్యసాహసాలు ప్రదర్శించగలిగినవాడే నిజమైన నాయకుడు అనిపించుకుంటాడు. ఇటీవలి కాలంలో అంతటి స్థాయి రాజకీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాత్రమే అని జనం అంటున్నారు. ఎందుకంటే ఆయన ప్రజలు కష్టాల్లో ఉంటే ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా సహాయం చేయడానికి రంగంలోకి దిగిపోతారు.. పార్టీ శ్రేణులనూ సమాయత్తం చేస్తారు. అలాంటి అసలు సిసలు నాయకత్వ పటిమ ఆయనలోనే చూడగల్గుతు న్నాం. ప్రజలు ఎప్పుడు సమస్యల్లో చిక్కుకున్నా ముందుగా స్పందించే నేతగా కిలివేటి సంజీవయ్య ప్రజల మనసులు గెలుచుకున్నాడు. ఏపార్టీ వారు అయిన తన దగ్గరకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వారికి పనులు చేసి పెట్టడం ద్వారా కిలివేటి సంజీవయ్య అందరివాడుగా పేరు తెచ్చుకున్నారు. నిరంతరం నియోజకవర్గంలోని గ్రామాలలో పర్యటిస్తూ అటు పార్టీని, ఇటు ప్రజలను సమన్వయం చేసుకుంటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కిలివేటి సంజీవయ్య పని చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే గా రెండు దఫాలుగా పనిచేసిన కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సులూరుపేట నియోజకవర్గాన్ని ఎన్నో గ్రామాలను మండలాలను అభివృద్ధి చేసి గ్రామాలు పట్టణాలను రూపురేఖలు మార్చి జిల్లాలోనే నంబర్ వన్ గా సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని కి ప్రత్యేక స్థానం తీసుకువచ్చారు.

**-కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటూ**

నియోజకవర్గంలోని మండలాలు గ్రామాల్లో నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు అండగా ఉంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ అందరిని కలుపుకొని సమన్వయం చేసుకుంటూ అందరివాడుగా ముందుకు సాగుతున్నారు. ఏది ఏమైనా సూళ్లూరుపేట నియోజకవర్గం లో అభివృద్ధి, సంక్షేమ మంత్రంతో పార్టీలకు అతీతంగా పనిచేస్తూ అందరిని కలుపుకొని పోతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తిరిగి మళ్లీ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించి ప్రజల పక్షాన నిలిచి నమ్ముకున్న కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలవాలని సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

## చిత్తూరులో రోడ్డు విస్తరణ జరగాల్సిందే

**- చిత్తూరు అభివృద్ధి కాంక్షించే వాళ్లంతా కలిసి రండి**

**- హైరోడ్డు రోడ్డు విస్తరణకు కలిసి వస్తే..**

**సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా : ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**



**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** చిత్తూరు నగర అభివృద్ధి కోరుకునే వాళ్లు, ఆశపడే వాళ్లంతా కలిసి రావాలని, రోడ్ల విస్తరణ.. మౌలిక సదుపాయాలు కల్పనతోనే చిత్తూరు నగరం సమగ్ర అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌గా అభివృద్ధి చేయడం, రోడ్ల విస్తరణ అంశా లపై సోమవారం సాయంత్రం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ప్రజా సంఘాలు, నగర అభివృద్ధి కమిటీలు, ప్రజా ప్రతినిధులు, వివి ధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం విజ యవంతంగా సాగింది. ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిత్తూరు నగరాన్ని స్మార్ట్ నగరంగా అభివృద్ధి చేయడం అనే అంశాల పై అన్ని వర్గాల ప్రజలు తమ అభిప్రాయా లను తెలిపారు. యువత, విద్యార్థులు మాట్లాడుతూ.. చిత్తూరు నగరాన్ని విద్యాపరంగా అభి వృద్ధి చేయాలని, యూనివర్సిటీ నెలకొ ల్పడం ద్వారా విద్యా అవకా శాలను మరింత మెరుగుపరచాలని కోరారు. వైద్యరంగం, మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ఐటీ కంపెనీల ఏర్పా టు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లా డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో రోడ్ల విస్తరణ అంశం గత పది సంవత్సరాలుగా నానుతుందని.. రోడ్లు అభివృద్ధి చెందితేనే నగరం అభివృద్ధి చెందుతుందని.. ఈ విష యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధానం గా హై రోడ్డు విస్తరణ అంశంలో కొంతమంది అభివృద్ధికి అడ్డుపడు తున్నారని.. అయినా ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. హైరోడ్ విస్తరణ కోసం అందరూ కలిసి వచ్చి ఏకగ్రీవంగా తీర్మానం చేస్తే.. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని.. విస్తరణలో నష్టపోయే వారికి తగిన విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. చెన్నై, బెంగళూరు నగరాల మధ్య ఉన్న చిత్తూరు అభివృద్ధి చెందడానికి అపారమైన అవకాశాలు ఉన్నా యని.. అయితే కొంత నష్టమైన ఇప్పుడు అందరూ కలిసికట్టుగా చిత్తూరు నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కలిసి రావా లన్నారు. మురుకంబట్టి నుంచి కలెక్టరేట్ వరకు, గురువారం నుంచి పుత్తూరు రోడ్డు వరకు రోడ్లను విస్తరించుకోవడం ద్వారా నగరాన్ని వేగంగా అభివృద్ధి వైపు నడపగలమని చెప్పారు. చిత్తూరు నగర అభివృద్ధి కోసం "స్మార్ట్ చిత్తూర్ డెవలప్మెంట్ కమిటీని" ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభివృద్ధి కోసం కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలతో కలిసి ముందుకు సాగుతామన్నారు. నాడు ముఖ్యమంత్రి గౌ. చంద్ర బాబు నాయుడుపై నమ్మకంతో అమరావతి రాజధాని కోసం 30 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని.. నేడు ఇదే రాజధాని ప్రాంతాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో చిత్తూరు ప్రజలు చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముం దుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, చుడా చైర్ పర్సన్ కె.హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజహసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, సహాయ కమిషనర్ ప్రసాద్, నగర ప్ర ముఖులు డీకే బద్రి నారాయణ, రావూరి ఈశ్వరరావు, వి. సురేంద్ర కుమార్, చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, కవిత, సప్తగిరి ప్రసాద్, శోభారాణి, గంటా మోహన్, సిపిఐ, సిపిఎం, బీఎస్పీల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కాలనీ సం ఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అలసత్వం వీడి అభివృద్ధిపై దృష్టి సారించండి : ఎమ్మెల్యే అమర్

**పలమనేరు, మేజర్ న్యూస్ :** పలమనేరు పట్టణంలో అడుగైనా అభివృద్ధి ముందుకు పడడం లేదని అధికారులు అలసత్వం వీడి అభివృద్ధిపై దృష్టి సాధించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికారులను ఆదేశించారు. పలమనేరులోని తన కార్యాలయంలో సోమవారం రెవెన్యూ మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టదలచిన ఎస్ టి పి ప్లాంటు, టౌన్ హాలు, బస్ షెల్టర్ల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్ లు, పైప్ లైన్ పనులు షాపింగ్ గదుల ఏర్పాటు తదితర పనుల పురోగతిపై ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో అధికారులు ఇచ్చిన వివరణకు ఆయన అసహనం



వ్యక్తం చేశారు. పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని వెంటనే పనులు జరిగేలా చూడాలన్నారు. రెవిన్యూ మున్సిపల్ అధికారులు సమన్వయంతో పట్టణంలో అభివృద్ధి మార్కు కనిపించేలా కృషి చేయాలని కోరారు. ఇక వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో నీటి ఎద్దడిని అధిగమించాలని సూచించారు. ప్రధానంగా గంగన్న శిరస్సు ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకుంటే పూర్తిస్థాయిలో పట్టణ నీటి సమస్యను అధిగమించేందుకు వీలుంటుందని దానిపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా పట్టణ శివారులలోని గంటావూరు,గడ్డురు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా గంటాఊరు కాలనీలో ఈ మధ్య కాలంలో చేపట్టిన అక్రమ పట్టాల విచారణలో వెలుగు చూసిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనర్హులను గుర్తించి అర్హులకే స్థలాలు అందేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో తహసిల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టిపి బిఓ ఇందిరా, మున్సిపల్ సర్వేయర్ ఆంజనేయులతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి : కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్న్యూస్:** పల్లె పండుగ కార్యక్రమంలో నరేగా కింద మంజూరు కాబడిన పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ పనులను రోజు వారీగా సమీక్షించుకుని పనులలో పురోగతి చూయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పంచాయితీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో ఎంపిడిఓ లు, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ పనుల పురోగతిపై గౌ. సిఎం, డిప్యూటీ సిఎం సమీక్ష చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మన జిల్లాలో పెండింగ్ లో ఉన్న క్యాటిల్ షెడ్ లు, సీసీ రోడ్ల నిర్మాణాలను రోజువారీగా సమీక్షించుకుని పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. మెటీరి




యల్ కాంపోనెంట్, ఫైనాన్సియల్ కంపోనెంట్లు వివరాలు సమీక్షించుకుని,ఆన్లైన్ ఎక్స్పెండిచర్ నమోదు చేయడం, బిల్లులు అప్లోడ్ చేయాలని అన్నారు. ఏఈ పీఆర్, ఏపీఓలు రోజువారీ ప్రణాళికతో ముదుకు వెళ్ళాలని, ఎంపిడిఓలు పర్యవేక్షించాలని సూచించారు. సదరు పల్లె పండుగ కార్యక్రమానికి సంబంధించిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసి సంక్రాంతి నాటికి ప్రారంభించేలా సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పురోగతిలో వెనుకబడిన అధికారులు, సిబ్బందిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పిడి డ్వామా, ఎస్ఈ పీఆర్ అధికారులకు పలు అంశాలు వివరించారు.

## సూర్య వార్తకు స్పందన

### వీధిని శుభ్రపరిచిన గ్రామపంచాయతీ సిబ్బంది

**పూతలపట్టు మేజర్న్యూస్:** మండలంలోని పి కొత్తకోట గ్రామపంచాయతీ పరిధిలోని చవటపల్లి దళితవాడలో వీధులు గుంతలమయమైందని పారిశుధ్యం లోపించిందని నేటి దినపత్రిక సూర్య జాతీయ తెలుగు దినపత్రిక లో 2024 డిసెంబర్ 15వ తేదీ ఆదివారం చవటపల్లి దళితవాడ పడకేసిన పారిశుధ్యం పట్టించుకోని పంచాయతీ అధికారులు ప్రభలబుతున్న వ్యాధులు అనే శీర్షిక వెలువడింది సోమవారం పి కొత్తకోట గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చౌటపల్లి దళితవాడలో వీధులను సోమవారం ఉదయం పరిశుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేశారు దీనితో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఢిల్లీ బాబు, గణపతి, పూర్ణ, నవీన్ కుమార్, కృష్ణమూర్తి, మునస్వామి, మహేష్, సల్లాపురి తదితరులు పాల్గొన్నారు.

## 30 నుంచి జనవరి 23వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు

**తిరుమల, మేజర్న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుండి 2025 జనవరి 23వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. సాధారణంగా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే ఈ అధ్యయనోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు. కాగా, తొలి 11 రోజులను పగల్పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూట్రందాది, 24వ రోజున శ్రీవరాహస్వామివారి శాత్తుమోర, 25వ రోజున అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి.

# తెలుగుదేశం పార్టీ హయాంలోనే సాగునీటి సంఘాల మహర్ధశ

## - ఎమ్మెల్యే పాశిం సునీల్కుమార్

**గూడూరు, మేజర్న్యూస్:** తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని వారి ఆకాంక్షల మేరకు పని చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం పార్టీ కార్యాలయంలో సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎంపికైన ప్రజా ప్రతినిధులను అభినందించే కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే సాగునీటి సంఘాలకు మహర్ధశ అని.... ఇకపైనా ఆ ఒరవడి కొనసాగుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎపుడూ ఉంటాయని తెలిపారు.






గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పార్టీ ఉన్నతికి కృషి చేయాలని అవసరమైన పరిస్థితుల్లో కొత్త వారిని పార్టీలోకి చేర్చుకుంటామని తెలిపారు. సాగు నీటి సంఘాలను ఏకగ్రీవం చేయడానికి కృషి చేసిన మండలాల్లోని అందరి నాయకులను అభినందిస్తూ సన్మానించారు. తన గెలుపుకు కృసి చేసిన ప్రతి ఒక్కరినీ కలుపుకు పోతూ అభివృద్ధిలో భాగస్వామ్యులను చేస్తానని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు శీలం కిరణ్కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివావాసులు, భాస్కర్రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లురాజు, నల్లపురెడ్డి జగన్మోహన్రెడ్డి, ధశరధరామిరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు కాణిపాకం రెవెన్యూగ్రామలో కుంట ఆక్రమణపై కరుణించండి

## - పాడి రైతులు జిల్లాకలెక్టర్కు ఫిర్యాదు

**చిత్తూరు, మేజర్న్యూస్:** ఐరాల మండలం కాణిపాకం రెవెన్యూ గ్రామంలో ఉన్న పశువుల దాహం తీర్చుకునే కుంటను అక్రమించుకొంటున్న కొందరు ఆక్రమణ దారులు పై జిల్లా కలెక్టర్ గారు కరుణించాలని కొందరు పాడి రైతులు సోమవారం ప్రజా సమస్యల వేదికలో ఫీర్యాదు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాడిరైతులు ఫిర్యాదు మేరకు కాణిపాకం రివెన్యూ గ్రామ లెక్కల దాఖలలో సర్వేనెంబరు 2/1 నందు ఉన్న విస్తీర్ణం గల స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం 40 మందికి ఇల్లు పట్టాలు మంజూరు చేసింది. అందులో40 కుటుంబాలు పక్కా గృహాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నాము. అదే సర్వే నెంబర్లో సుమారు 100 సంవత్సరాలుగా ఒక ఎకరా విస్తీర్ణం గల భూమి ఉంది. అభూమిలో చుట్టుపక్కల





ఉన్నపాడి రైతులు అయిన వెనుక బడిన కులాలకు చెందిన వారు మేము పశువులను,గొఱ్ఱెలను, మేకలను మేత కోసం తరలించి మేపుకొని కుటుంబాలను పోషించు కొనే వారము.అందులో పశువులు దాహం కోసం కుంట నిర్మించారు. అనీటి కుంటలో బట్టలు కూడా ఉతకతుండే వారము.వేసవి కాలంకూడా నీరు పుష్కలంగా ఉంటుంది. అయితే కొంత మంది ఆక్రమణ దారులు అకుంట ను తొలగించి ఆక్రమించుకొని జేసిబి తో చదరం చేసి ప్లాట్లు వేసి అమ్ముకోవడానికి సిద్ధంచేస్తున్న ఫోటోలు కూడా ఫిర్యాదులో జతపరిసినట్లు ఫిర్యాదులో తెలియజేసిఉన్నారు. కావున జిల్లా కలెక్టర్ గారు మాపై దయ ఉంచి కుంట ఆక్రమణ పై విచారణ జరిపి ఆక్రమణ దారులపై తగు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

### - నగరపాలక సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్న్యూస్:** చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందాయని నగరపాలక సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినుతుల స్వీకరించారు. వినతుల పరిష్కారంపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. గతవారం అందిన అర్జీలపైన సమీక్ష నిర్వహించారు. సోమవారం నాటి పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం -3, ఇంజనీరింగ్ -3, టౌన్ ప్లానింగ్ -2, రెవెన్యూ -1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వామి సన్నిధిలో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామివారి ఉత్సవ విగ్రహానికి పలు రకాల విశేష పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాల సమర్పించారు. అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న పదహారు కాల మండపంలో అయ్యప్ప స్వామిని కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ.ఈఓ లోకేష్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరిబాబు యాదవ్, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తీశ్వర సన్నిధిలో గొబ్బెమ్మ ఉత్సవం :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా గొబ్బెమ్మ ఉత్సవాన్ని కనుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ.ఈఓ లోకేష్ రెడ్డి ,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరిబాబు యాదవ్, ఆలయ అధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.





## చట్ట పరంగా ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాం : ఎస్పీ

**-జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రజల నుండి 90 ఫిర్యాదులు అందాయి.**



తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని,ఈ ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదులు సివిల్ కేసులకు సంబంధపడినవి అయితే వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని బాధితులకు అర్థమయ్యే విధంగా చెప్పి సూచనలు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార. వేదిక కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదుదారులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు ఇచ్చారు అందరితో జిల్లా ఎస్పీ మాట్లాడి సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా చర్యలను తీసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ కార్యాలయానికి 90 ఫిర్యాదులను వచ్చాయి వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు వారికి సంబంధపడిన పోలీస్ స్టేషన్/ సర్కిల్ కార్యాలయాలు/ సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆ ఫిర్యాదులను కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణిస్తామని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు రవిమనోహర ఆచారి శాంతి భద్రతలు, నాగభూషణం క్రైమ్ వారు పాల్గొన్నారు.

## బాధ్యతతో ప్రజా ఫిర్యాదులు పరిష్కరించండి : కమిషనర్ మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:**



బాధ్యతతో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిని పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు ఆదేశించారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో సుమారు 49 మంది సమస్యలతో కూడిన వినతులను కమిషనర్ కి అందజేశారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఆర్.సి. మునికృష్ణ, అనిల్ కుమార్లులు కమిషనర్‌కు వినతులు సమర్పించారు. ఇందులో ముఖ్యంగా తమకు టీ.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, అర్హులైన వారికి పింఛన్లు ఇప్పించాలని, తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రక్షణ కల్పించాలని, మురుగు కాలువల్లో చెత్త తొలగించాలని,వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని, వర్షాల్లో నగరపాలక సంస్థ సేవలు బాగున్నాయని పలువురు చెప్పారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, డి.సి.పి. మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డి.ఈ.లు, ఏ.సి.పి.లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పీజీఆర్ఎస్ లో ఉన్నారు.

## డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ నిర్వహణ, ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజల నుండి అందే పీజీఆర్ఎస్, సిఎంఓ, రెవెన్యూ సదస్సులు, ఆన్లైన్ తదితర విధానాల్లో వచ్చే గ్రీవెన్స్ అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా, అర్థవంతంగా సమస్యలకు పరిష్కారం చూపాలని, గ్రీవెన్స్ రీ ఓపెన్‌కి తావు లేకుండా నాణ్యతగా పరిష్కరించాలని, పీజీ ఆర్ ఎస్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై జిల్లా కలెక్టర్ గారు జెసి శుభం బన్సల్ తో కలిసి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, డివిజన్, మండల అధికారులతో వర్చువల్ విధానంలో కేసుల వారీగా పలు ఫిర్యాదులు సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) లో వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతగా, అర్థవంతంగా, నాణ్యతగా నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని, పరిష్కరించలేనివి అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. రీ ఓపెన్ కి తావు లేకుండా పరిష్కారం చూపాలని అన్నారు.

**డివిజన్, మండల స్థాయిలలో....**

ప్రజా ఫిర్యాదుల కొరకు పీజీఆర్ఎస్ కు వచ్చే ఫిర్యాదు దారులకు మర్యాద పూర్వకంగా, ఓపికగా, వారి అర్జీని సావధానంగా విని పరిష్కార దిశగా అర్జీదారుని సమస్యకు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సముచితంగా వారికి స్థానం కల్పించి గ్రీవెన్స్ డెస్క్ ఏర్పాటు ఉండేలా చూడాలని సూచించారు. అర్జీదారులకు కనీసం త్రాగు నీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, అలాగే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీవెన్స్ స్వీకరణ అర్థమయ్యేలా ఫ్లో చార్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ర్యాంప్, వీల్ చైర్స్ ఏర్పాటు, వాటి వినియోగ సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెన్షన్, రేషన్ కార్డులు, అన్నా క్యాంటీన్లు, దీపం 2.ఓ, వ్యవసాయ ఆధారిత అంశాలైన ధాన్యం కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు, ధాన్యం ధరల స్థిరీకరణ, విత్తనాల పంపిణీ, రెవెన్యూ, మున్సిపాలిటీలు, పంచాయితీ రాజ్ శాఖ, విద్యుత్ శాఖ, ఉచిత ఇసుక, మద్యం పాలసీ, గుంతలు లేని రోడ్లు, మహిళల పట్ల హింస, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కొరకు ఉన్నత పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, తదితర అంశాలపై తగు చర్యలు ఉండాలని సూచించారు. ప్రజా రవాణా సేవలు, వైద్య ఆరోగ్య సేవలు వంటి వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతగా పరిష్కరించాలని, పలు ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని తెలిపారు. పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ కు అధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, వర్చువల్ విధానంలో డివిజన్, మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి ఎయిర్ పోర్ట్‌లో శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్ ని పరిశీలించిన టీటీడీ చైర్మన్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయంలో గల శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్ ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టికెట్లు పొందుతున్న భక్తులతో మాట్లాడారు. భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. విమానాశ్రయంలోని కౌంటర్లలో టికెట్ల పొందుతున్న భక్తులు టిటిడి చైర్మన్ ముందు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విమానాశ్రయంలోని కౌంటర్లో భక్తులు రోజు వారీ టికెట్లు ఎన్ని తీసుకుంటున్నారని కౌంటర్ సిబ్బందిని చైర్మన్ అడిగి తెలుసుకున్నారు.

## కలెక్టర్‌గారు... వడ్డిపల్లి వసతులుపై కరుణించండి

**- వడ్డి పల్లి గ్రామస్తులు విజ్ఞప్తి**

**పూతలపట్టు మేజర్‌న్యూస్:** మండలంలోని పి కొత్తకోట గ్రామ పంచాయితీలో ఉన్న వడ్డిపల్లి వసతులపై జిల్లా కలెక్టర్ గారు కరుణించాలని వడ్డేపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికి వడ్డేపల్లి గ్రామం మాత్రం అనేక వసతులు కరువై అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వాటర్ ట్యాంక్, సిమెంటు రోడ్లు, నీటి కొళాయిలు, డ్రైనేజ్ కాలువలు లేక అనేక అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారలేదు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజ్ కాలువలు లేకపోవడం చేత మురికి నీరు వీధుల్లో ప్రవహిస్తుంది దీంతో వర్షాకాలం సీజన్లో దోమలు అధికమై అంటువ్యాధులు అయినా జ్వరాలు,అతి సారా వంటి వ్యాధులు సోకి అవకాశం ఉంటుందని బయందోళనకు గురవుతున్నాము అని అన్నారు. వాటర్ ట్యాంక్, వీధి కొళాయిలు లేకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సిమెంట్ రోడ్లు నిర్మించకపోవడం చేత పారిశుధ్యం లోపించి గుంతల మైమై వర్షం నీరు నిలిచి, పిచ్చి మొక్కలు పెరిగి దోమల బెడద ఎక్కువైందని గ్రామస్తులు అంటున్నారు ఇదివరకు అనేకసార్లు వడ్డీపల్లి వసతులు కల్పించాలని ప్రభుత్వ అధికారులకు లిక్కిత పూర్వకంగా వినతి పత్రాలు సమర్పించినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. కావున జిల్లా కలెక్టర్ గారు వడ్డి పల్లి వసతులపై కరుణించి సమస్యలు పరిష్కరించాలని వడ్డేపల్లి గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## సెల్ ఫోన్ లకు విద్యార్థులు బానిసలు కాకూడదు..

**-అందులోని టెక్నాలజీ ఉపయోగించుకుని భవిష్యత్తు ఏర్పరచుకోండి**

**-రిమ్స్ కళాశాల డైరెక్టర్ వై.ఆనంద రెడ్డి సూచన**

**తిరుపతి ప్రెస్ క్లబ్,మేజర్ న్యూస్:** విద్యార్థులు నేడు మారుతున్న టెక్నాలజీ యుగంలో..సెల్ ఫోన్ లకు బానిస కాకుండా,వారి భవిష్యత్తుకు కావాల్సిన టెక్నాలజీని ఉపయోగించుకుని మంచి ఉద్యోగాలు సంపాదించ కోవాలని "రాయలసీమ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్" (రిమ్స్) కళాశాల డైరెక్టర్ వై.ఆనంద రెడ్డి విద్యార్థులకు సూచించారు.స్థానిక బైరాగి పట్టెడలోని రిమ్స్ కళాశాల నందు ఎంబీఏ,ఎంసీఏ, ఎంఎస్సి (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు శుక్రవారం నుండి ఆదివారం వరకు మూడు రోజులపాటు నిర్వహించిన టెక్నో అండ్ గ్యాబ్ ఫెస్టివల్-2024 సదస్సులు ఆదివారం ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా తిరుపతి రూరల్ మండలం సి. గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం నందు ముగింపు కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ వై. ఆనంద రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ ఉజ్వల భవిష్యత్తుకు కారకులైన తల్లిదండ్రులు అలాగే గురువులను విద్యార్థులు మరిచిపోకూడదని తెలిపారు.యంగ్ మేనేజర్ విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని పావని (ఎంబీఏ),సృజన్ (ఎంసిఏ) లకు ఆనంద రెడ్డి చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జె.ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్లీనమైన ప్రతిభను ప్రదర్శించేందుకు, లోపాలను సరిదిద్దుకొని.. సామర్ధ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయని అన్నారు.ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనంద రెడ్డి, వై.విజయ్ రెడ్డి, హెచ్ ఓ డి లు పి.నిరంజన్ రెడ్డి, పి.మధుర, కళాశాల సిబ్బంది, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ : పట్టణం లోని ఇందిరానగర్ కి చెందిన నల్లిబోయన రామ చంద్రయ్య కుమార్తె నల్లిబోయన తేజస్విని జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. సోమవారం ఉదయం ఇందిరానగర్ లో ఉన్న ప్రాథమికో ఉన్నత పాఠశాల లోని విద్యార్థిని విద్యార్థులకు భోజనం ప్లేట్లు మరియు పరీక్ష మెటీరియల్, బిస్కట్స్ ఇవ్వటం జరిగింది. ముందుగా తేజస్విని కి శ్రద్ధాంజలి గటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, తేజస్విని తండ్రి నల్లిబోయన రామచంద్రయ్య, స్కూల్ హెడ్ మాస్టర్ కాంతమ్మ, సుధాకర్ రాజు, వార్డ్ అధ్యక్షులు మన్నెపల్లి చంద్రయ్య, మునగాల చక్రవర్తి, నాగుభూషణం, కృష్ణయ్య, లాలు యాదవ్ ,తరుణ్,సురేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకొండ మల్లీశ్వర స్వామి 16సీటీఆర్01

వెదురుకుప్పం, మేజర్ న్యూస్: మండలంలోని మాంబేడు పంచాయితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండ మల్లీశ్వర స్వామికి అభిషేక పూజలు చేశారు. సోమవారం శ్రీ కొండమల్లీ శ్వర స్వామినిప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యనిర్వహులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు.

## జాతీయస్థాయి సాఫ్టాల్ పోటీలకు తేజశ్రీ ఎంపిక



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** జమ్మూ కాశ్మీర్‌లో జరగబోవు జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్టాల్ పోటీలకు వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. డిసెంబరు 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్లో జాతీయస్థాయి సాఫ్ట్బాల్ పోటీలు జరగనున్నాయని, ఇందులో తమ పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని తేజశ్రీ ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. తేజశ్రీ జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తేజశ్రీ ఎంపిక కావడం పట్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్టాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన యాదవ్, రమేష్ లు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

## వేరుశనగ పంటలు పరిశీలన

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని ఆర్కే వి బి పేట పంచాయతీలు రైతులు పండించిన వేరుశనగ పొలాల వ్యవసాయ శాఖ అధికారిని హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ వేసిన రైతులు రెండోసారి కలుపు తీసేటప్పుడు అంటే దాదాపు 40 నుండి 45 రోజులప్పుడు ఎకరానికి 4 బస్తాలు జిప్సం ఎరువు చల్లుకుని, ఆ తరువాత కలుపు తీసుకోవడం ద్వారా 5- 6 బస్తాలు అధిక దిగుబడి పొందడమే కాకుండా, గింజ సైజ్ పెరగడానికి, పప్పులో నూనె శాతం పెరగడానికి చాలా ఉపయోగపడుతుంది, జిప్సం లో కాల్షియమ్ ఉడలు బలంగా ఉంచి, కోత అప్పుడు కాయలు నేలలో ఉండి, నష్టం రాకుండా చేయవచ్చును.



## శ్రీ శ్రీ పొన్నాలమ్మకు ధనుర్మాసం అభిషేకాలు



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి పట్టణం పానగల్ శ్రీ శ్రీ శ్రీ పొన్నాలమ్మ దేవస్థానంలో సోమవారం నుండి జనవరి 15 వరకు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు. అలంకరణలు నిర్వహిస్తారు. ఈరోజు ధనుర్మాసం ప్రారంభం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు హారతులు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ముక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పొన్నాలమ్మ దేవస్థానం చైర్మన్ పుదూరు లక్ష్మణ్ రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## శివయ్య సేవలో సినీ డైరెక్టర్ పరుశురాం



**శ్రీకాళహస్తిఅర్బన్, మేజర్‌న్యూస్:** శ్రీకాళ హస్తీశ్వర స్వామి దేవస్థానంకు తెలుగు సినిమా డైరెక్టర్ పరుశురాం విచ్చేశారు వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక రాహు కేతు పూజ అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తి సామి ప్రత్యేక దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్ఓ రవి ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలు 596

## కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి సోమవారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. జిల్లావ్యాప్తంగా నేడు 29 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నేడు జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబందిత అధికారులు పాల్గొని విజయవంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 6316 అర్జీలు అందాయని అందులో నేడు 596 అర్జీలు వచ్చాయని అందులో ప్రభుత్వ భూ ఆక్రమణలపై -2, హౌస్ సైట్స్ పై - 111, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ పై -44, రీ సర్వే పై -31, ఇళ్ళ స్థాలు, ప్రాజక్ట్ భూ సేకరణ పై 20, ల్యాండ్ గ్రాబింగ్ పై 1, ఆర్ ఓ ఆర్ పై -221, రెవెన్యూ ఇతర విషయాలకు సంబంధించి 152 వచ్చాయని తెలిపారు. సదరు అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

**దొరవారి సత్రం, మేజర్ న్యూస్:**



దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డిసెంబర్ 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు దొరవారి సత్రం తహశీల్దార్ శైల కుమారి తెలిపారు సోమవారం మండలంలోని కల్లూరు గ్రామంలోని కల్లూరు కండ్రిగ రెవిన్యూ సూరగుంట తాగేలి రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైల కుమారి మాట్లాడారు.గ్రామంలోని ప్రజలకు చెందిన రెవెన్యూ సంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సులలో పరిష్కార దిశగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలురెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజున వచ్చే అర్జీలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సర్వే, అడంగల్, 1-బి రికార్డు,కుల ధ్రువీకరణ పత్రం,ఆదాయ ధ్రువీకరణ పత్రం,మ్యుటేషన్, పేరు సవరణ తదితర పత్రాలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను మండల ప్రజల సద్వినియోగం చేసుకొని తమ భూములకు సంబంధించి పూర్త హక్కులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖ అధికారులు సర్పంచ్ ఇట్టగుంట పురుషోత్తం మాజీ జడ్పిటిసి ఇట్టగుంట రత్నయ్య పాల్గొన్నారు.

## మా గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చండి



**కె వి బి పురం, మేజర్ న్యూస్:** అలుకూరు మునెమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో పంచాయితీ చిరువాయి కట్టు దారులు శాఖ మూరి లోకనాయుడు మంజుల, బాలసుబ్రమణ్యం శంకరయ్య రాజయ్య బాలాజీలు పలువురు తమ గ్రామంలో భూమి చేర్పులో మార్పులు తదితర రెవెన్యూ విషయాలపై అర్జీలు పత్రాలు అందించారు. అనంతరం ఎగువపూడి పంచాయతీలో ఆ పంచాయతీ చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ బాలకృష్ణంరాజు టి వెంకటయ్య చంగల్రాయలు కన్నయ్య చిన్నబ్బ రాజు కె మునేయ్య ఎగువపూడి స్మశాన భూములను కాపాడాలని దేవస్థానం భూములకు పట్టాలు ఇవ్వాలని గ్రామసభలో మా గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చాలని గ్రామ ప్రజలు కోరారు ఈసందర్భంగా ఎమ్మార్వో పి మునిరత్నం తోపాటు సచివాలయ సిబ్బంది మండల స్థాయి అధికారులు సర్పంచ్ కురు మునెమ్మ వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు ఆయకట్టు చైర్మన్ శాఖమూరి లోక నాయుడు. మాజీ సర్పంచులు సుబ్రహ్మణ్యం రాజు. రాములు. మునెయ్య గౌడ్. స్థానిక ప్రజలు తదితరులు సభలో పాల్గొన్నారు.

## 18న విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు

**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు 18 తేదీన ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం నిర్వహించి జరుగుతుందని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. వైద్య శిబిరం హాజరయ్యే వారు ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు హాజరయ్యి వారికి అవసరమైన ఉప కారణాలు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మామిడి పంట భీమాకు ఈ పంట నమోదు తప్పనిసరి

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** మామిడి పంట భీమాకు ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ ఉపసంచాలకులు మధుసూదన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం భీమా సౌకర్యం కల్పించిందని, జిల్లా లో మామిడి పంటకు వాతావరణం ఆధారిత భీమ పథకము వర్తింపజేశారు. మామిడి పంట వేసుకున్న రైతులు ఎకరాకు రూ.1750 ప్రీమియం చెల్లించి భీమా చేసుకోవాలని మామిడి పంట కు నష్టం జరిగితే ఎకరాకు రూ. 35 వేలు వరకు భీమా మొత్తాన్ని అందజేస్తుందని తెలిపారు.2024 డిసెంబరు 1 వ తేది నుండి 2025 మే నెల 31 వరకు మధ్యకాలంలో వచ్చే అనుకల వాతావరణ పరిస్థితులకు సంబంధించి మామిడి పంటకు నష్టం జరిగితే భీమా పొందవచ్చునని తెలిపారు.మామిడి పంటకు భీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, ఈ పంట చేసుకున్న వారు గత సంవత్సరంలో గానీ, ఇంతవరకు ఈ పంట బుకింగ్ చేసుకోకపోయిన ప్రస్తుత రబీ సీజన్ లో ఈ పంట బుకింగ్ తప్పనిసరిగా చేసుకొని ప్రీమియం చెల్లించి భీమా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. మామిడి రైతులు అందరూ ఇప్పటికే ఈ పంట నమోదు చేసుకున్నట్లయితే వెంటనే ఆర్.బి.కే ఇన్చార్జిలను కలిసి పంట నమోదు చేసుకోవాలని, వెంటనే మామిడికి ఇన్స్యూరెన్స్ కూడా చేసుకోవచ్చునని తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా జిల్లాలోని మామిడి రైతులకు సూచించారు.

## చల్లా శ్రీదేవికి డాక్టరేట్ ప్రదానం

**తిరుపతి ప్రెస్ క్లబ్, మేజర్‌న్యూస్:**



స్థానిక ఎస్వి యూనివర్సిటీ జువాలజీ విభాగ పరిశోధకురాలు చల్లా శ్రీదేవి "డాక్టరేట్" పొందారు.ఇంపాక్ట్ ఆఫ్ ఆర్సనిక్ అండ్ కాడ్మియం ఇన్ హిస్టోపథలాజికల్ అండ్ బయో కెమికల్ చేంజెస్ ఇన్ లివర్ అండ్ కిడ్నీ ఆఫ్ మెయిల్ ఆల్బినో రాట్స్ (ఆర్సనిక్ మరియు కార్మియం ప్రభావం వల్ల మగ ఆల్విన్ ఎలుకల కాలేయం, మూత్రపిండాలకు సంబంధించి కణజాల వ్యాధులు, జీవ రసాయన మార్పులు) అనే అంశంపై ఆమె సిద్ధాంత గ్రంధాన్ని..విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఏ.ఉషారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఆమె ఇప్పటివరకు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధనా పత్రాలు సమర్పించి..వివిధ సదస్సుల్లో పాల్గొన్నారు.ఈమె రూపొందించిన పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. వీటన్నిటి దృష్ట్యా ఈమెకు సిఈ దామ్లా నాయక్ డాక్టరేట్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

## లక్ష్యాలను సాధించేందుకు గ్రామ పంచాయతీలో పనిచేయాలి

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** సుస్థిరాభివృద్ధి లక్ష్యలను సాధించేంత వరకు పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు అందురూ సమిష్టిగా కృషిచేసి పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని కాపాడాలన్నారు. ఎల్ యస్ డీ జి ఎస్ ఈ శిక్షణలో నేర్చుకున్న వాటిని గ్రామాల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈ ఓ పి ఆర్ డీ నాగరత్నమ్మ, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు ద్వారా భూ సమస్యలు పరిష్కారం



**ఏర్పేడు, మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు జరుగు రెవిన్యూ సదస్సులులో భాగంగా ఏర్పేడు మండలం మేర్లపాక రెవెన్యూ గ్రామాల్లో అధికారులు నాయకులతో రాష్ట్ర అధికార ప్రతినిధి. క్లస్టర్ ఇంచార్జ్ రెడ్డివారి గురవారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కృష్ణవేణి. పార్లమెంటు బిసి ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రహ్మణ్యం, మండల బీసీ సెల్ అధ్యక్షులు మునెయ్య. సదా శంకర్ నాయుడు. నాయకులు రమణయ్య. నరసింహులు నాయుడు. గోపాల్ రెడ్డి. శివారెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ పట్టాభిరామాలయంలో ధనుర్మాస విశేష పూజలు



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో ధనుర్మాస సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు పూజా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి వ్యవహరించారు. 16వ తేదీ సోమవారం నుండి ప్రారంభమైన ధనుర్మాసం జనవరి 13వ తేదీ భోగి పండుగ రోజు వరకు జరుగుతాయని, ప్రతిరోజు స్వామి వారికి మేలుకొలుపు,సుప్రభాత సేవ,బిందెతీర్థం, ప్రభాత కాలార్చన,విశేష పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు దీవి అనంతాచార్యులు తెలియజేశారు.

## వాకాడు కొత్త దళితవాడలో పగిలిన పైపులైన్.. విధుల్లో పారుతున్న నీరు

**- కలుషిత నీరు త్రాగి రోగాల బారిన పడుతున్న ప్రజలు**



**వాకాడు, మేజర్ న్యూస్:** వాకాడు కొత్త దళిత వాడలో మంచి నీటి పథకం పైపు లైన్ పగిలి త్రాగు నీరు వీధుల్లో వృధాగా పోతుంది. పైపు లైన్ పగిలి పది రోజులు అవుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించు కోవడం లేదని దళితవాడకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో నీరు పారడం వల్ల దళిత వాడ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతే కాకుండా పగిలిన పైపుల్లో వచ్చే కలుషిత నీరు త్రాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దళిత వాడలో ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని వారు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## 35 మద్యం సీసాలు స్వాధీనం నిందితుడు అరెస్టు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ద్విచక్ర వాహనంలో 35 మద్యం బాటలను తీసుకొని వెళుతుండగా అతని వద్ద మద్యం బాటలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని వద్ద మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

## నాగరాజుకు డివైన్ తాంత్రీగా అవార్డు



**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** పుదుచ్చేరి వేదికగా 3వ ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరిట్యువల్ ఆస్ట్రాలజర్స్ కాన్ఫరెన్స్ ఈనెల 15వ తేదీన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతికి చెందిన నాగరాజుకు డివైన్ తాంత్రీగా అవార్డు అందు కున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరియూవల్ ఆస్ట్రాలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షు డు డాక్టర్ జె. నరసింహ స్వామి విశ్వనాథన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాగరాజును అభినందించారు.

## రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న ప్రభుత్వ విప్



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని టీకేఎం పేట పంచాయతీలో మంగళవారం జరగనున్న రెవెన్యూ సరస్సుకు గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి యం థామస్ హాజరవుతారని మండల పార్టీ అధ్యక్షులు ఉదయం 10 గంటలకు మండలంలోని టీకేఎం పేట గ్రామ సచివాలయం నందు రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు కార్వేటినగరం టీడీపీ కార్యాలయం నందు కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లో నూతనంగా ఎన్నిక కాబడిన నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బిజెపి నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## దర్శనానికి వచ్చే భక్తులతో ఆలయ సిబ్బంది మర్యాద పూర్యకంగా మెలగాలి

**- ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్**



**ఐరాల, మేజర్ న్యూస్ :** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సందర్శ నార్థం ప్రాతినిత్యం సుదూ రా ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తుల తో ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకం గా మెలగాలని ఆలయ ఈవో కె. పెంచల కిషోర్ పిలునిచ్చారు. సోమ వారం కాణిపాకం కార్యని ర్వాహణా ధికారి కార్యాలయంలోఅన్ని విభాగాల సిబ్బందితో సమక్ష సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగాఆలయ ఈవో మాట్లాడుతూ కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సందర్శ నార్థం వివిధ సుధురా ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులతో ఆలయ సిబ్బందిమర్యాదపూర్వకంగా సంబోధించండి విధులు పట్ల సక్రమంగా హాజరై విధిగా విధులు నిర్వహించండి, లేనియెడల క్రమశిక్షణ చర్యలు ఉంటాయిని హెచ్చరించారు. పరిసరాలలో బస్టాండు ప్రాంతాల్లో పరిశుభ్రతను నిర్వహించాలి దర్శనార్థం విచ్చేయు భక్తులకు సక్రమంగా దర్శన ఏర్పాట్లు నిర్వహించాలి సూచించారు. వివిధ అంశాలపై అదేవిధంగాసిబ్బందితో చర్చించి సూచనలు జారీ చేశారు ఈ సమావేశం నందు ఏ ఈ ఓ లు ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరెంటెండ్లు వాసు, బాలరంగస్వామి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాన్ స్కూటర్ ఢీకొని ఒకరి దుర్మరణం

**ఎస్ఆర్ పురం మేజర్ న్యూస్:** టాటా ఏస్ వ్యాన్ స్కూటర్ ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటుచేసు కుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి బసిరెడ్డిపల్లి కాలనీ వద్ద టాటా ఎస్ వ్యాన్ చిత్తూరు వైపు వెళ్తుండగా యు యం పురం గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనం మీదుగా స్వగ్రామమైన యుగం పురం నికి వెళ్తూ ఉండగా ఢీకొనడంతో ఈ ప్రమాదంలో స్కూటర్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు ఇతనిది మండలంలోని యు యం పురం గ్రామానికి చెందిన ప్రభాకర్‌గా స్థానికులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## విద్యుత్ కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం అభినందనీయం

**-ఏపీఈసిఈఏ(జి-3045) హర్షం**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లాలో సిబిడి గ్యాంగ్ లో తొలగించినటువంటి గణేష్ అనే విద్యుత్ కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం అభినందనీయమని, దీనికి సహకరించిన విద్యుత్ యాజమాన్యానికి అలాగే కాంట్రాక్టర్ కు విద్యుత్ కార్మికుల అందరి



తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (జి- 3045) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతి ఎస్ఈ కార్యాలయం నందు అధికారిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో సిబిడి గ్యాంగ్‌లో టవర్ ఎక్కడ టెస్ట్ ద్వారా నియామకం జరుగుతుందని తెలిపారు. తొలగించబడిన గణేష్ కు గత బుధవారం రోజున చిత్తూరు సబ్ స్టేషన్ లో టెస్ట్ చేసి అంగీకరించడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లు ఇప్పటికే కార్మికులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలో జరగబోయే విద్యుత్ యాజమాన్యం హెచ్ఆర్ కమిటీ సమావేశంలో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను చర్చించి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జి-3045 అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దివాకర్ రెడ్డి,చిత్తూరు డివిజన్ సర్వణ,కలికిరి డివిజన్ రెడ్డప్ప,వేణు,తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.




## జాతీయస్థాయి "జంప్ రోప్" పోటీలకు మంగళం విద్యార్థులు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** తిరుపతి అర్బన్,మంగళం లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్(మంగళం ట్రెండ్స్) కు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపిక కాబడ్డారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.కేశవులు నాయుడు తెలిపారు. ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలోని విజ్ఞాన్ హైస్కూల్ నందు జరిగిన రాష్ట్రస్థాయి 5వ జూనియర్ అంతర్ జిల్లా ఛాంపియన్ షిప్ లో పాల్గొని తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఇంటర్ చదువుతున్న రమ్యశ్రీ, 8వ తరగతికి చదువుతున్న కోకిల రెడ్డి, 6వ తరగతి చదువుతున్న సుకన్యలు స్వర్ణ పథకాలు సాధించగా 8వ తరగతికి చెందిన భవ్య వైష్ణవి, 6 వ తరగతికి చెందిన కీర్తిక,చక్రవర్తి,విహిత్ లు కాంస్య పథకాలు సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు మరియు రామకృష్ణ తెలియజేశారు. వీరిలో స్వర్ణ పతకాలు సాధించిన ముగ్గురు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను శ్రీధర్, జగన్నాథ రావు, మనోహర్,కృష్ణమ నాయుడు,మునిరత్నం, వెంకటేష్ తదితర ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు ఎస్ఎంసి సభ్యులు పాల్గొని అభినందించారు.

## ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



**గూడూరు, మేజర్‌న్యూస్:** ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం దాని కూటమి పారట్‌ఈల్లు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రజా సంఘాల ఆద్వర్యంలో నిరసన తెలిపారు. గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో సోమవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని తగ్గిస్తామని, ఎన్నికల్లో టిడిపి కూటమి హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందని, స్మార్ట్ మీటర్లు వద్దని, పెడితే పగలగొట్టమని, కూటమినేతలు ప్రతిపక్షంలో ఉండగా ప్రజలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. మీటర్లు వద్దని హైకోర్టులో కేసు కూడా వేశామని అధికారంలోకి రాగానే మాట తప్పి రూ.15,484 కోట్ల సర్దుబాటు చార్జీల భారం ప్రజల మీద వేయడం జరిగిందని, ఈ నెల నుండి కరెంట్ బిల్లులు పెంచడం, పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇది మీటర్ కాదని "స్మార్ట్ బాంబ్" అని ఇందులో ప్రమాదం ఉందని, ఈ ప్రీపెయిడ్ మీటర్ల వలన ఫోన్లో బ్యాలెన్స్ వేయించుకున్నట్లు కరెంటుకి బ్యాలెన్స్ వేయించుకోవాలని, డబ్బు ఐపోగానే కరెంటు ఆగిపోతుందని, మళ్లీ రీచార్జ్ చేయించుకోవాలని, ఈ మీటరుకు అయ్యే ఖర్చు పది నుండి పదిహేను వేల రూపాయలు అవుతుందని, మన కరెంటు బిల్లులతో పాటు నెలకు రూ.100 నుండి 150 రూపాయలు అదనంగా వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారన్నారు. ఈ మీటర్లు పెడుతున్నారని ఇప్పటికైనా స్పందించి స్మార్ట్ మీటర్లు ఆపాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిఓలు తగులు పెట్టి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం శాఖ కార్యదర్శి జోగి.శివకుమార్ సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు డి.వెంకట్రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఈ. శ్రీనివాసులు, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు అధ్యక్ష,కార్యదర్శులు బి.వి రమణయ్య, ఎస్.సురేష్, నాయకులు పుట్టా శంకరయ్య, బి.చంద్రయ్య, అడపాల ప్రసాద్ గుర్రం రామనయ్య, ఏ. చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 185 అర్జీలు : కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ కె. మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తాగు నీటి సమస్య తీర్చడమే ప్రధాన లక్ష్యం

### - ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** నగర వాసుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం వివిధ ప్రాంతాల్లో తవ్విన నూతన బోర్లు, మోటార్లను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరపాలక పరిధిలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.1.30 కోట్లతో 22 బోర్లు తవ్వి, మోటార్లు బిగించినట్లు చెప్పారు. నగర వాసులు నీటికి ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో బోర్ల తవ్వకానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. నగరవాసుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్పొరేషన్ విలీనమైన పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలో 13వ వార్డు మాపాక్షి, 12వ వార్డు పరిధిలోని రామాపురం, ఎంకే పురం, గంగినేని చెరువు వద్ద, 49వ వార్డు దుర్గా కాలనీలో బోరు, మోటర్లకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. మాపాక్షి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, ఇన్చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్వో డా. లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 150 అర్జీలు

### - జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని, రీ ఓపెన్ కు తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి అని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డి ఆర్ ఓ నరసింహులు, తదితర అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు :రి రెవెన్యూ -94, టిడ్కో-1, పంచాయతీ రాజ్ -13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్- 8, గృహనిర్మాణ శాఖ -2, పోలీసు శాఖ -8, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ -7, మెడికల్ అండ్ హెల్త్- 2, రవాణా శాఖ - 1, సెర్ప్ -2, పరిశ్రమలు-1, తుడ -1, విద్యుత్ శాఖ -1, ట్రైబల్ వెల్ఫేర్ -5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ -2, అటవీ శాఖ -1, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ - 1 వెరసి మొత్తం 150 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



## ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరి అరెస్ట్

**తిరుపతి ప్రెస్ క్లబ్,మేజర్ న్యూస్:** అన్నమయ్య జిల్లా,చెయ్యేరు నదీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒకరిని టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు.అతని నుంచి 6 చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.టాస్క్ ఫోర్సు ఇన్చార్జి,తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి,వి.శ్రీనివాసరెడ్డి మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ ఆదివారం నుంచి జాంద్రపెంట ఎఫ్బీవో కలిసి గుర్రపు బాట తూర్పు వైపున గల చెయ్యేరు వైపు కూంబింగ్ చేపట్టారు.సోమవారం తెల్లవారు జామున వీరు మేకల కోన వద్దకు చేరుకోగా,అక్కడ కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు.

దీంతో వారిని చుట్టుము ట్టేందుకు ప్రయత్నించగా, వారు దుంగలు పడేసి పారిపోసాగారు.అయితే టాస్క్ ఫోర్సు పోలీసులు వెంటపడి,ఒకరిని పట్టుకోగలిగారు. ఆ ప్రాంతంలో పరిశీలించి చూడగా, ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు.టాస్క్ ఫోర్సు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల మార్చి నెల కోటా విడుదల

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల 2025 మార్చి నెల కోటాను డిసెంబరు 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల రిజిస్ట్రేషన్ కోసం డిసెంబరు 18 నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు డిసెంబరు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

ఈ నెల 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల...

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను డిసెంబరు 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.డిసెంబరు 21న వర్చువల్ సేవల కోటా విడుదల.వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మార్చి నెల కోటాను డిసెంబరు 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.డిసెంబరు 23న అంగప్రదక్షిణం టోకెన్లు.మార్చి నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను డిసెంబరు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా.శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన మార్చి నెల ఆన్ లైన్ కోటాను డిసెంబరు 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మార్చి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను డిసెంబరు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.డిసెంబరు 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల.మార్చి నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను డిసెంబరు 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల.తిరుమల, తిరుపతిలలో మార్చి నెల గదుల కోటాను డిసెంబరు 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

## 27 న కాణిపాకం గణనాధుని హుండీ కానుకల లెక్కింపు

ఐరాల, మేజర్ న్యూస్: ఈనెల 27 వతేది శుక్రవారం ఉదయం7 గంటలకు కాణిపాకం స్వయం భూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి హుండీ కానుకలను స్వామి వారి ఆస్థాన మండపంలో లెక్కిస్తున్నట్లు ఆలయ ఈవో కె.పెంచల కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్వామి వారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి పలువురు ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది సకాలంలో పాల్గొనాలని ఆలయ ఈఓ కోరారు.

జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116